సిద్దిపేట సంగారెడ్డి మెదక్



శనివారం 1 ఆగస్టు 2026 పేజీలు : 8





# దౌల్తాబాద్‌లో కొలతల తూనికల బృందం పేరుతో దోపిడి

## దుకాంతారుల నుండి అధిక డబ్బులు వసూలు

## పట్టించుకోని సంబంధిత అధికారులు

**హత్నూర 30 జూలై (ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని దౌల్తాబాద్ పట్టణంలో శుక్రవారం నాడు కొలతల తునికెల బృందం దుకాన్దారుల దగ్గర నుండి కొలతల తునికల లైసెన్సులపేరుతోటి ఒక్కొక్క దుకాణంలో అంజాదా 1000 నుండి 1500 రూపాయల చొప్పున వసూలు చేస్తుండగా పలువురు దుకాంధారులు నిలదీస్తూ డబ్బులు వసూలు చేసుకొని రసీదు ఇవ్వమని అడిగితే తర్వాత తెచ్చి ఇస్తామని చెప్పి వెళ్ళిపోతున్నారని పలువురు దుకాంధారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కోలతల తునికిల అధికారి ఇన్స్పెక్టర్ అనిల్ ను వివరణ కోరగా రుసుము చెల్లించిన యెడల రసిది ఇవ్వకపోతే కాంట్రాక్టు లైసెన్సు రద్దుచేసి వారిపై కఠిన చర్య తీసుకుంటామని అన్నారు.

ఊరు కాసే తల్లి ఉరిమి చూడంగా

# బురద రోడ్లల్లో బోనం ఎట్ల తీయాలి ?

## జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పి. రాములు నేత



# ప్రకృతిని గౌరవించండి..!

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

## దత్తగిరి పీఠాధిపతులు

## అవధూతగిరి, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

## భక్తిశ్రద్ధలతో జప యజ్ఞం





**జహీరాబాద్, జూలై 31(ప్రజా జ్యోతి న్యూస్)** తల్లిదండ్రులను గౌరవించడం, గోమాతను సంరక్షించడం, ప్రకృతి పరిరక్షణతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ - మిగతా3లో

# భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం





ఆత్మ ఆధ్వర్యంలో కృష్ణాపూర్ గ్రామం లో నిర్వహించిన వరి పొలం బడి కార్యక్రమం

ఏడిఏ నూతన్ కుమార్

రైతులు మంచి దిగుబడి సాధించాలంటే కచ్చితంగా భూసార పరీక్షలు చేయించాలి శాస్త్రవేత్త డాక్టర్ అరుణ

**కల్హేర్ , జూలై 31: ప్రజా జ్యోతి** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో శుక్రవారం వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఫార్మ్ స్కూల్--పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం, సంగారెడ్డి శాస్త్రవేత్త డాక్టర్ అరుణ మాట్లాడుతూ భూసార పరీక్షల సిఫారసుల మేరకే రసాయన ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. అనువైన వరి వంగడాలను ఎంపిక చేసుకోవడంతో పాటు సస్యరక్షణ చర్యలను పాటించాలని తెలిపారు. వరి కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరాకు 8 నుంచి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను వినియోగించాలని సూచించారు. 25 నుంచి 30 రోజుల వయస్సు దాటిన నారును కొనలు త్రుంచి నాటితే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువులు వేయడం వల్ల భూమి సారవంతత దెబ్బతింటుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శశికల ,. కాంగ్రెస్ నాయకుడు ఎం. తుకారం.మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్, రామ్‌రెడ్డి, రైతులు గోపాల్, పండరి, సంగమేశ్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, వ్యవసాయ అధికారులు సాయిలు, బీటీఎం మారుతి రెడ్డి తదితరులు రైతులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మున్సిపల్ ఎదుట చెప్పుతో కొట్టుకున్న కౌన్సిలర్ భర్త






మా మద్దతుతో పీఠం ఎక్కి.. మా వార్డులకే ద్రోహం చేస్తారా ?

కాంగ్రెస్ చైర్మన్ పై నిప్పులు చెరిగిన ఎంఐఎం నేత

ఆరు నెలలుగా వార్డుల్లో ఆగిపోయిన అభివృద్ధి పనులు పట్టించుకోని చైర్మన్, కమిషనర్.

మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ మీటింగ్ జరుగుతుండగా తీవ్ర నిరసన.

ఎంఐఎం నుంచి గెలిచి కాంగ్రెస్ కు మద్దతు తెలిపినందుకు ప్రాయశ్చిత్తంగానే ఈ శిక్ష అంటూ ఆవేదన

**జహీరాబాద్, జూలై 31 (ప్రజా జ్యోతి న్యూస్)** మున్సిపల్ చైర్మన్,కమిషనర్ ల నియంతృత్వ, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో ఒక కౌన్సిలర్ భర్త తనకు తాను చెప్పుతో కొట్టుకుని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ నుంచి గెలిచి, కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించి నందుకు ప్రాయ శ్చిత్తంగానే ఈరోజు ఈ నిర్ణయం తీసుకున్నా నని ఆయన మీడియా ముఖంగా ఆవేదన, ఆక్రోశం వెళ్లగక్కారు. గత ఆరు నెలలుగా తమ వార్డుల్లో కనీస అభివృద్ధి పనులు జరగడం లేదని, ఎన్నిసార్లు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ల దృష్టికి తీసుకెళ్లినా వారిలో కనీస చలనం లేదని ఆయన మండిపడ్డారు. పదే పదే మొరపెట్టుకున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యా రని, తమ వార్డు ప్రజలకు సమాధానం చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవు తున్నామని స్పష్టం చేశారు. "అధికారం కోసం వాడుకుని. ఇప్పుడు వదిలేస్తారా ?" జహీరాబాద్ మున్సిపాలిటీ లో ఎంఐఎం పార్టీ రెండు స్థానాలను కైవసం చేసుకుంది. చైర్మన్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు అవసరం కాగా, ఎంఐఎం సభ్యులు కాంగ్రెస్ కు మద్దతు తెలిపి వారిని చైర్మన్ పీఠంపై కూర్చో బెట్టారు. "మా మద్దతుతో గెలిచిన తర్వాత, ఇప్పుడు మమ్మల్నే పక్కకు పెట్టి మా వార్డుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసం ?" అని వారు సూటిగా ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ చైర్మన్ ప్రదర్శిస్తున్న రాజకీయ కృతఘ్నతకు నిదర్శనం అని దుయ్యబట్టారు.కార్యాచరణ కు హెచ్చరిక మేము మద్దతు ఇవ్వకపోతే మీరు ఆ కుర్చీలో కూర్చునే వారే కాదు అన్న వాస్తవాన్ని చైర్మన్ గుర్తుంచుకోవాలి. కేవలం పదవి దక్కేవరకే ఒక మాట, దక్కిన తర్వాత మరొక మాట మాట్లాడటం మానుకోవాలి. తక్షణమే మా వార్డుల్లో ఆగిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి. చైర్మన్, కమిషనర్లు తమ మొండి వైఖరిని వీడి పనులు చేపట్టకపోతే, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ఇంతకంటే తీవ్రమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని వారు హెచ్చరించారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్



**జహీరాబాద్, జూలై 31 (ప్రజా జ్యోతి న్యూస్)** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ కోరారు. గురువారం నిర్వహించిన మున్సిపాలిటీ అత్యవసర సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై గుంతలను ఎప్పటి కప్పుడుపూడ్చేయాలన్నారు తద్వారా వాహనాలు ప్రమాదానికి గురి కాకుండా చూడాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి అక్కడ నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలవ్యాప్తిగా జరగ కుండా తరచూ ఫాగింగ్ చేపడుతుండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంత రాయం లేకుండా చూడాలన్నారు. శిథిలా వస్థలో ఉన్న నిర్మాణాలు గుర్తించి ప్రజలను అక్కడ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకకుండా చర్యలు తీసుకో వాలన్నారు. ప్రజలకు వర్షం పడినప్పుడు జాగ్రత్తగా ఎలా ఉండాలో అవగాహన కల్పించాలని కౌన్సిలర్ అప్పం శ్రావన్ సూచించారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితిలో మున్సిపాలిటీ వాసులు సంప్రదించడానికి ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు ఏర్పాటు చేయాలని విన్నవించారు. హైదరాబాద్ లో డిసాస్టర్ రెస్పాన్స్ టీంలాగా జహీరాబాద్ లో కూడా ప్రత్యేక బృందాలను నియమించాలని మున్సిపల్ కమిషనరుతో పాటు చైర్మన్ ను కోరారు. అధికారులు సరిగ్గా స్పందించడం లేదు. స్ట్రీట్ లైట్స్ విషయమై కౌన్సిలర్ అప్పం శ్రావణ్ మాట్లాడుతూ ప్రజలు వీధి దీపాల కోసం చాలాకాలంగా ఫిర్యాదులు అందిస్తున్నారని అన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా సరైన స్పందన లభించడం లేదన్నారు. తాము కాల్స్ చేసినా అధికారులు ఎత్తడం లేదని. కనీసం తిరిగి కాల్ చేయడం లేదని అన్నారు. ప్రజాప్రతినిధులుగా తమకు అధికారులిచ్చే గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షానికి ఒకలాగా, ఇతర పక్షాల కౌన్సిలర్లకు ఒకలాగా న్యాయం ఉందా అని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఇప్పటికైనా స్ట్రీట్ లైట్స్ సమస్యతో పాటు ఇతర ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ప్రకృతిని గౌరవించండి..!

-మొదటిపేజీ తరువాయి

సంతోషాలతో జీవించాలని సంకల్పంతో బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శుక్రవారం మహా మృత్యుంజయ లక్ష జప యజ్ఞం, శివపార్వతుల కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.భక్తులు మహా మృత్యుంజయ మంత్రాన్ని లక్షసార్లు పారాయణం చేశారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన జప యజ్ఞం మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషా లకు పూర్ణాహుతితో ముగిసింది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని ప్రేమించాలని పీఠాధి పతులు భక్తులకు ఉపదేశించారు. యజ్ఞంలో బర్దిపూర్ గ్రామానికి చెందిన సంగీత--కాశీనాథ్, శివనాగమ్మ, రమేష్ పాటిల్, కోట స్వరూప, శ్రీనివాస్, సువర్ణ, నాగన్న పాటిల్, పుష్పమ్మ, ఎల్లన్న దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేశారు.

# కృష్ణాపూర్‌లో ఆత్మ ఆధ్వర్యంలో వరిపై పొలం బడి శిక్షణ కార్యక్రమం

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 31:** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణఖేడ్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో వరి సాగుపై ఫార్మ్ స్కూల్ పొలం బడి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువుల వాడకం వల్ల భూమి సారం తగ్గే ప్రమాదం ఉందన్నారు. రాబోయే నెలల్లో ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని కొంత మేర తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సంగారెడ్డి శాస్త్రవేత్త డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. భూసార పరీక్షల సిఫారసుల మేరకే రసాయన ఎరువులను వినియోగించాలని సూచించారు. అనువైన వరి వంగడాలను సాగు చేయడంతో పాటు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. వరి కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరాకు 8 నుంచి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఉపయోగించాలని



సూచించారు. అలాగే 25 నుంచి 30 రోజులు దాటిన నారును కొనలు త్రుంచి నాటితే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుకారాం, మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్, రాంరెడ్డి, అలీ, రైతులు గోపాల్, పండరి, సంగమేశ్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, వ్యవసాయ విస్తరణ అధికారి సాయిలు, బీటీఎం మారుతి రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## జోగిపేటలో బీజేవైఎం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సంతకాల సేకరణ

### రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్

**అందోల్, జూలై 31, (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా జోగిపేటలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం భారతీయ జనతాపార్టీ యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో శు క్రవారం విస్తృత



సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం శాఖ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆదేశాలు, సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బొర్రా ప్రవీణ్ యాదవ్ సూచనల మేరకు బీజేపీ అందోల్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కన్వీనర్ పల్లె ప్రభు కుమార్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, జోగిపేట పట్టణ కార్యదర్శి ఎం. పాపయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రశాంత్ వొకేషనల్ కళాశాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై అవగాహన కల్పిస్తూ సంతకాలు సేకరించారు. సుమారు 600 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ ప్రవీణ్ అప్ప, ప్రవీణ్ రెడ్డి, ప్రశాంత్ జోగిపేట, అరవింద్ సి, లక్కీ వి, మణి, శివ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరు కాసే తల్లి ఉరిమి చూడంగా బురద రోడ్లల్లో బోనం ఎట్ల తీయాలి ?



జహీరాబాద్, జూలై 31( ప్రజా జ్యోతి న్యూస్)

పట్టణంలోని హమాలి కాలనీలో గల పెద్దమ్మ దేవాలయంకు శాంతినగర్ ఐడిఎస్ ఎంటి కాలనీ హమాలి కాలనీ ప్రజలు ఆదివారం నాడు పెద్దమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు తీయడం జరుగుతుంది.బోనాలు తీయడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలతో కూడిన బురద రోడ్ల నుండి అపరిశుభ్రమురికి కాలువల పక్కనుండి బోనాలు తీయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వాస్తవానికి వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రత కొరకు తెలంగాణ ప్రభుత్వం పురపాలక సంఘాలకు కోట్లాది రూపాయలు నిధులను విడుదల చేసిన జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హమాలి కాలనీ ప్రధాన మైన రోడ్డు శుభ్రత లేకపోవడం శోచనీయం బాధాకరం ఇకనైనా ఒకరోజు సమయం మిగిలి ఉన్నందున పెద్దమ్మ తల్లి దేవాలయంకు వెళ్లే ప్రధానమైన రోడ్డు బుర్దమయంగా ఉన్నందున చిన్నపిల్లలు వృద్ధులు వికలాంగులు ఆ రోడ్డు గుండా వెళ్లాలి అంటే జారి పడగలమని భయపడు తున్నారు. కావున మొరం గాని లేదా సన్నటి కంకర లాంటిది వేసి పండుగను పరిశుభ్ర వాతావరణంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు జరగకుండా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని హమాలీ కాలనీ ప్రజల తరపు నుండి కోరడం జరుగుతుంది.

## శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చిన శ్రీ ఊరడమ్మ అమ్మవారు

**జహీరాబాద్, జూలై 31 (ప్రజా జ్యోతి న్యూస్)** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడిలో వెలసిన శ్రీ ఊరడమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలు, వంకాయలు, బెండకాయలు, మిరపకాయలు, క్యాబేజీ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, పూలతో ప్రత్యేకంగా చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా



ఆకట్టుకుంది. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. శాకాంబరి దేవి అలంకరణ ప్రకృతి సంపద, వ్యవసాయాభి వృద్ధి, ప్రజల ఆరోగ్యం, సమృద్ధికి ప్రతీకగా భావిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వ హించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు పి.శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సిద్దు రవి, పాండు, ఫవాన్, సుధాకర్, నాగరాజు, విక్రమ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కంది మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** కంది మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం కంది మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం నూతన గౌరవ అధ్యక్షులుగా చేర్యాల నర్సింలు, అధ్యక్షులుగా రాంచందర్, ఉపాధ్యాక్షులు, ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా ఎర్దనూర్ వేంకటేష్, కోశాధికారిగా కంది రాజేందర్, ప్రచార కార్యదర్శిగా కశిపురం రాజు, ముఖ్య సలహదారులుగా జల్ కల్ దుర్గయ్య, అశోక్, కాశిపురం గోపాల్, ఇంద్రకరణ్ అశోక్, బ్యాతల్ మధుసుధన్, చేర్యాల మూరళి, చేర్యాల రఘునందన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ... సంఘ అభివృద్ధితో పాటు నాయి బ్రాహ్మణ సమాజ ఐక్యత, సంక్షేమం, సేవా కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. బాధ్యతగా వ్యవహరిస్తూ సంఘ అభ్యున్నతికి పాటుపడుతామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివకాంతం, ప్రధాన కార్యదర్శి రాజారాం, డివిజన్ అధ్యక్షులు చేర్యాల ఆంజనేయులు, సంగారెడ్డి పట్టణ గౌరవ అధ్యక్షులు దత్తాత్రి, అధ్యక్షులు లకుడారం మాణిక్ ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, యువసేన జిల్లా అధ్యక్షులు మారేపల్లి నరసింహులు, యువత అధ్యక్షులు చరణ్, కోశాధికారి హనుమంతు, కంది మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరం..

**ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి: ప్రజాసంఘాల పిలుపు..**

**కొండాపూర్ ప్రజా జ్యోతి** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కొండాపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కొండాపూర్ మండల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, రైతాంగానికి నష్టదాయకమైన విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం నిర్ణయించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ




యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొండాపూర్ మండలంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే మండల వ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు బాబురావు, ఆవాజ్ నాయకులు ఆసిఫ్ అలీ, ప్రజాసంఘాల నాయకులు అర్జున్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేట సరస్వతి శిశుమందిర్‌లో రోటరీ క్లబ్ సదాశివపేట వారి ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** వాతావరణ సమతుల్యతను కాపాడడమే ధ్యేయంగా సదాశివపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిజాంపూర్ రోడ్డులోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ ప్రాజెక్ట్‌లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో 50కి పైగా మామిడి, పనస, కొబ్బరి మొక్కలను క్లబ్ సభ్యులు నాటారు.

**కాలుష్య నివారణకు మొక్కలు తప్పనిసరి**

ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త, నియమిత కార్యదర్శి మఠం రాచన్న స్వామి మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి, ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం తప్పనిసరి అని పిలుపునిచ్చారు. అనంతరం కాలుష్య కోరల నుండి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశంపై పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు**

ఈ పర్యావరణ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రముఖుల ఓదెల ప్రభు గుప్త (రోటరీ క్లబ్ అధ్యక్షులు) మఠం రాచన్న స్వామి (నియమిత కార్యదర్శి) ముంద్రా వేణుగోపాల్ (కోశాధికారి) దిద్గే వినోద్, తంగడపల్లి లక్ష్మణ్, ౘదీ శరత్చంద్ర (సర్వీస్ ఠ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్లు)మాశెట్టి ప్రవీణ్, బచ్చు సత్యనారాయణ (క్లబ్ సభ్యులు)పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు.

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణ తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే , శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సదాశివపేట మండలం రెజింతల్ గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. గ్రామంలో ప్రస్తుతం శ్మశానవాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున సర్వే నెం.149లోని ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం రెవెన్యూ శాఖలో చాలా లాంగ్ పెండింగ్‌లో ఉన్న వివిధ దరఖాస్తులు, భూ సంబంధిత సమస్యల పరిష్కార పురోగతిపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వినతులపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, మధుసూదన్ రెడ్డి, చీల మలన్న, లక్ష్మారెడ్డి, మజీద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో సివిల్ సర్వీసెస్ డే నిర్వహణ

**ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించిన ఏఎస్ఐ రషీద్ ఆలీ**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్ఐ రషీద్ ఆలీ మాట్లాడుతూ, ప్రజలకు సమర్థవంతమైన ప్రభుత్వ సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని అన్నారు.ప్రజలు చట్టాలను గౌరవిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. మహిళలు, యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రియాంక నర్సింలు, కార్యదర్శి రాజలింగం, వార్డు సభ్యులు మన్నె రామయ్య, మన్నె ఎల్లయ్య, గొల్ల శ్రీకాంత్, కొత్తగాడి వీర రెడ్డి, అన్వర్ పాషా, గోసుల శ్రీకాంత్, కుమ్మెర శ్రీకాంత్ గౌడ్,గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పచ్చదనమే గ్రామాభివృద్ధికి పునాది..

**గంగారాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దుదాం: సర్పంచ్ సరిత అశోక్...**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** ఒక్కో ఇంటికి ఒక మొక్క.. ఒక్కో మనిషికి పర్యావరణంపై బాధ్యత" అనే సందేశంతో కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పరిత ఆలేక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సరిత అశోక్ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నేడు నాటే మొక్కలే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను స్వీకరించి వాటిని నాటేందుకు ముందుకు వచ్చారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 31:** నారాయణఖేడ్ మండలం గౌరారం తండా గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు రాజు నాయక్ సోదరుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాంచేందర్, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, దేవిదాస్, కాంగ్రెస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దెగులువాడి గ్రామాన్ని ఆగస్టు 2న ఐఎన్‌హెచ్ఆర్‌పీసీ చైర్మన్ నవోదయ సిద్ధార్థ రాక



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 31:** కంగ్టి మండలం దెగులువాడి గ్రామానికి చెందిన బాధితులు ఇటీవల హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయాన్ని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థను కోరిన నేపథ్యంలో, ఆయన ఆగస్టు 2న దెగులువాడి గ్రామాన్ని సందర్శించనున్నారని సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, న్యాయం జరిగేలా సంస్థ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, బాధితుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకునే అంశంపై చర్చించనున్నారన్నారు. ఈ పర్యటనలో సంస్థ నాయకులు, సభ్యులు, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

**– మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్ సంతాపం**



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 31:** తెలంగాణ ఉద్యమకారుడు,నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు పెళ్లి చేసుకోనని ప్రతిజ్ఞ చేసి,ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్నే అంకితం చేసిన నిస్వార్థ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో పెద్ది సుదర్శన్ రెడ్డి వివాహం జరిగిందని తెలిపారు.అలాంటి ఉద్యమకారుడు నేడు మన మధ్య లేకపోవడం యావత్ తెలంగాణ సమాజానికి తీరని లోటు. ఆయన ఆశయాలు,ఉద్యమ స్ఫూర్తి తరతరాలకు ఆదర్శంగా నిలిచిపోతాయని మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అన్నారు.

## పగటిపూట దొంగతనానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**-- రూ.15 లక్షల విలువైన బంగారం,వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం**



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 31:** శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పిలుట్ల గ్రామంలో ఇటీవల జరిగిన పగటిపూట ఇంటి దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువైన 8 తులాల బంగారు ఆభరణాలు,99 తులాల వెండి వస్తువులు,కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పిలుట్ల గ్రామానికి చెందిన బొబ్బరి శ్రీశైలం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళాలు తీసి లోపలికి ప్రవేశించాడు.అనంతరం ఇంట్లోని బీరువాలను పగులగొట్టి అందులో ఉన్న సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు,99 తులాల వెండి వస్తువులు,కొంత నగదును అపహరించి పరారయ్యాడు. బాధితుడు బొబ్బరి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ్వంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా గతంలో నేర చరిత్ర ఉన్న అనుమానితులపై నిఘా ఉంచిన పోలీసులు పిలుట్ల గ్రామానికి చెందిన బొబ్బరి గోపాల్ (30),తండ్రి రాములు,వృత్తి కూలీని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో మద్యం అలవాట్లు,జల్సాలకు డబ్బులు అవసరమవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. శ్రీశైలం ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి పగటిపూట ఇంట్లోకి ప్రవేశించి దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకుని,అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్న తూప్రాన్ సీఐ వెంకటరాజ్ గౌడ్,శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డి,సిబ్బంది గోవర్ధన్,వెంకట్,కృష్ణ, మహేందర్,ఘటేష్‌లను తూప్రాన్ డీఎస్పీ అభినందించారు.

## పాఠశాలలో బోధన కంటే సెల్‌ఫోన్లకే ప్రాధాన్యమా?

**తల్లిదండ్రుల ఆరోపణలు**

**వివరణ కోరగా ఫోన్ కట్ చేసిన మండల విద్యాధికారి?**




**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు హాజరవుతున్నప్పటికీ, విద్యార్థులకు బోధనపై పూర్తి దృష్టి పెట్టకుండా ఎక్కువ సమయం సెల్‌ఫోన్లలోనే గడుపుతున్నారని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థుల చదువు నాణ్యత దెబ్బతింటోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారి (ఎంఈఓ)ను సంప్రదించి వివరణ కోరగా ఫోన్ కాల్‌ను నిలిపివేసి, “తిరిగి కాల్ చేస్తాను” అనే సందేశాన్ని పంపినట్లు సమాచారం. అయితే, ఈ వార్త ప్రచురించే సమయానికి ఆయన నుంచి పూర్తి వివరణ అందలేదు. పాఠశాలల్లో బోధన సక్రమంగా జరుగుతోందా, తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగంపై ఉన్న నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

## నారాయణఖేడ్ ఆత్మ చైర్మన్‌గా వినోద్ పటేల్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 31:** నారాయణఖేడ్ నియోజకవర్గ ఆత్మ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడంపై వినోద్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సహకారంతో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## ఒక వైపు రాయలసీమ... మరో వైపు ఉత్తరాంధ్ర...

## అంతు చిక్కని జగన్ వ్యూహం

**విజయవాడ :** ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం ప్రజాస్వామ్యంలో కొత్తేమీ కాదు. అయితే, ఒకే రాజకీయాధికారం కోసం ఒకే పార్టీ ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో భిన్నమైన, వివాదాస్పదమైన డిమాండ్లను తెరపైకి తెచ్చే వ్యూహాలు అరుదుగా కనిపిస్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం అమలు చేస్తున్నట్లుగా భావిస్తున్న వ్యూహం సరిగ్గా ఈ తరహాకే చెందినది. ఒకవైపు రాయలసీమ అన్యాయం పేరుతో ప్రత్యేక రాష్ట్ర హోదా అనే నినాదాలను సజ్జల రామకృష్ణారెడ్డి వంటి నేతల ద్వారా ప్రోత్సహిస్తూ, మరోవైపు ఉత్తరాంధ్రలో ధర్మాన ప్రసాదరావు వంటి సీనియర్ నేతలతో ప్రత్యేక ఉత్తరాంధ్ర సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల వాస్తవ అవసరాలు, వారి ఆలోచనా ధోరణితో సంబంధం లేకుండా కేవలం సొంత మీడియా, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా తమ అభిప్రాయాలను ప్రజలపై రుద్దవచ్చన్న ధీమా ఈ తరహా వ్యూహాలకు మూలధనం. సమాజంలో ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పుడు వాటిని పరిష్కరించే సమగ్ర ప్రణాళికలు రూపొందించడం బాధ్యతాయుతమైన రాజకీయం అవుతుంది. కానీ, ప్రాంతాల మధ్య వైషమ్యాలను రగిల్చడం పొలిటికల్ ప్రాక్సీ డ్రామాను తలపిస్తోంది. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేస్తే తమకు రాజకీయంగా మేలు అనుకుంటున్నారు. ఈ తరహా ప్రాంతీయ విద్వేష వ్యూహం రాజకీయంగా తగలబెట్టేలా మారే ముప్పు ఎక్కువ. 2019–2024 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల ప్రయోగం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పరిపాలనా వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పదబంధం వెనుక అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విభజనలను రగిల్చారనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. ఫలితంగా, ఏ ఒక్క ప్రాంతంలోనూ వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విశ్వసనీయత దక్కకపోగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఒకసారి దెబ్బతిన్న వ్యూహాన్నే మళ్లీ కొత్త సీసాలో పాత మద్యంలా మార్చి ప్రయోగించడం పార్టీ భవిష్యత్తుకే ప్రమాదకరం. తమపై తామే పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకోవడం లాంటి ఈ తీరు వల్ల గతంలో వచ్చిన చేదు అనుభవాల నుంచి నాయకత్వం పాఠాలు నేర్చుకోలేదనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. మూడు రాజధానుల అంశంపై ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఇప్పటికే రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లగా, ఇప్పుడు మళ్లీ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ఉద్యమాల పేరుతో ప్రాంతీయ కార్డ్‌ను ఉపయోగిస్తే మిగిలిన కొద్దిపాటి రాజకీయ స్థానం కూడా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఓటర్లు వైరల్ కంటెంట్‌కే పరిమితం కావడం లేదు.. గందరగోళం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వ్యూహాలు సుదీర్ఘకాలంలో వికటిస్తాయి. సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో, ప్రాంతాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించే విధానం వైఎస్సార్‌సీపీని మరింత రాజకీయంగా ఒంటరిని చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ అఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణాత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది–తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్ , బీజేపీ సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమ్ములోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ అఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

## కేటీఆర్ హస్తిన పర్యటనల వెనుక...

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరసగా ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇటీవల హస్తిన బాట పట్టడం ఒకింత రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. అధికార పక్షంలో ఉన్న వారు సహజంగా హస్తినకు వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి చర్చించడం ఎక్కడైనా జరుగుతుంది. కానీ తెలంగాణలో మాత్రం కేటీఆర్ ఇటీవల కాలంలో వరసగా ఢిల్లీకి వెళుతూ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఇదొక రకమైన సవాల్ విసురుతున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ఆదిలాబాద్ లో సీసీఐ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. రెండు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం కూడా చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరోసారి ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కేటీఆర్ కలిశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, ఐటీ విస్తరణ మరియు జాతీయ రాజకీయ వ్యూహాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఆర్ ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సిరిసిల్ల రైల్వే ప్రాజెక్టుతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే పనులపై చర్చించారు. రాష్ట్రంలో కొత్త ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి కేంద్ర పెద్దలతో మాట్లాడారు.

## గూడూరు శ్రీ గురుపీఠంలో చోరీ..

**--హుండీలు పగులగొట్టి నగదు అపహరణ**



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 31:** శివ్వంపేట మండలంలోని గూడూరు శ్రీ గురుపీఠంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ మహాస్వామి ఆలయం, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. రెండు ఆలయాల హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం ఆలయ కార్యనిర్వాహకుడు సత్యనారాయణ గౌడ్ ఆలయానికి వచ్చి పరిశీలించగా, ఆలయ తలుపులు, హుండీలు పగులగొట్టిన విషయం గుర్తించారు. వెంటనే ఆలయ చైర్మన్ శివకుమార్ గౌడ్‌కు సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించింది. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 16 అడుగులకే గణేశుడి ప్రతిమలు

## పోలీస్ శాఖ వార్నింగ్

**హైదరాబాద్ :** వినాయక నవరాత్రోత్సవాల నేపథ్యంలో గణేశ్ విగ్రహాల తయారీదారులకు సీపీ సజ్జనార్ కీలక సూచనలు జారీ చేశారు. విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు మించకూడదని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, రవాణా సమయంలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని.. ఈ సారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సీపీ సజ్జనార్ హితవు పలికారు. త్వరలోనే దేశవ్యాప్తంగా వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే గణేష్ విగ్రహాల తయారీదారులకు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన హైదరాబాద్ సీపీ.. గణేష్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగుల కంటే ఎక్కువ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇక ఈ ఏడాది ఖైరతాబాద్ మహా గణపతిని 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో తీర్చిదిద్దనున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. గురువారం గణేష్ విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడిన సీపీ సజ్జనార్.. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు గుర్తుచేశారు. వినాయక విగ్రహాల రవాణా సమయంలో జరిగిన 4 ప్రమాదాల నేపథ్యంలో ఈసారి మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. మట్టి గణేష్ విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని.. చిన్న విగ్రహాల ప్రతిష్ఠాపనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ సూచించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, సురక్షిత విద్యుత్ వైరింగ్ తప్పనిసరిగా అమలు